క్లుప్తంగా

పొలం గట్లపై కూరగాయల సాగు



బద్రి సమీపంలో వరి పొలం గట్టుపై సాగు చేస్తున్న బీర

సారవకోట: మండలంలోని పలు గ్రామాలలో వరి పంట పొలాల గట్లపై కూరగాయల సాగు విస్తారంగా చేస్తున్నారు. సారవకోట, అన్నుపురం, బద్రి, గోపాలపురం, లక్ష్మీపురం తదితర గ్రామాలలో చిక్కుడు, బీర, తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుతో అదనపు ఆదాయం పొందడంతో పాటు వరికి వచ్చే తెగుళ్లను ముందుగా గుర్తించవచ్చనే ఉద్దేశంతో ప్రతిఏటా సాగు చేస్తున్నారు.

పంట నమోదు పరిశీలన



బసవరాజుపేటలో పంటన మోదును పరిశీలిస్తున్న ఏఓ సింహాచలం

హిరమండలం: మండలంలోని ప్రతీ రైతు పంటలను నమోదు చేసుకోవాలని ఎల్.ఎన్.పేట ఏఓ కె.సింహాచలం అన్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని బసవరాజుపేటలో పంటల నమోదును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 9,953 ఎకరాల్లో పంట వరి సాగు చేస్తుండగా.. ఇప్పటివరకు 5,604 ఎకరాల వరకు పంట నమోదు జరిగిందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు రైతులు సహకరించి పంటలను నమోదుకు చేసుకోవాలన్నారు. పంటలను నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి పరిహారం అందదన్నారు.

రావివలసలో పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ వేయిస్తున్న సర్పంచ్ వండాన కృష్ణ

సరుబుజ్జిలి: రావివలస పంచాయతీలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మురుగునీటి కాలవలు, రహదారుల పక్క ఉన్న చెత్త, ముళ్లపొదలు తొలగించి చెత్త సంపద కేంద్రానికి తరలించారు. పాడైన బోర్లు మరమ్మతులు చేశారు. బోర్లు, నేలబావుల వద్ద ఈగలు, దోమలు చేరకుండా క్లోరినేషన్ చేయించారు. ఈ పనులను సర్పంచ్ వండాన కృష్ణ పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంపై ఆరా



కాలిపోయిన షాపును పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

కొత్తూరు: కొత్తూరు–బత్తిలి రోడ్డులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన కమల హార్డ్‌వేర్ షాపును శ్రీకాకుళం క్లూస్‌టీమ్ సభ్యులు సీఐ చింతాడ ప్రసాదరావు ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. యజమానితో మాట్లాడి షార్టు సర్క్యూటా.. మరేదైనా కారణమా అని నిశితంగా పరిశీలించారు. ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేలబొంత నుంచి గొట్టిపల్లి వెళ్లే రహదారి దుస్థితి



రహదారుణాలు



పంట కాలువను తలపిస్తున్న కుద్దబ రహదారి



బురదమయమైన అంపురం గ్రామానికి వెళ్లే రహదారి



రాళ్లుతేలిన సవర మర్రిపాడు రహదారి

- అవస్థలు పడుతున్న గిరిజనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మెళియాపుట్టి: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గిరిజన గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. కనీసం నడవడానికి కూడా వీల్లేని స్థితిలో రహదారులు తయారయ్యాయి. మండలంలోని చింతలపోలూరు, కుద్దబ నుంచి అచ్చనాపురం, నేలబొంత నుంచి గొట్టిపల్లి గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఆంపురం, సవర మర్రిపాడు, భరణికోట, బాలేరు, జగన్నాథపురం గ్రామాల రహదారుల్లో సైతం రాళ్లుతేలాయి. వర్షం నీరు రహదారులపై ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులను బాగుచేయాలని పాలకులు, అధికారులను వేడుకుంటున్నారు.

16 నెలల్లో విద్యుత్ బాదుడు రూ.19 వేల కోట్లు



- చార్జీల తగ్గింపు ప్రకటన హాస్యాస్పదం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి

హిరమండలం: విద్యుత్ చార్జీలు తగ్గిస్తున్న కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటన హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక రూపాల్లో విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. 16 నెలల కాలంలోనే విద్యుత్ బిల్లుల రూపంలో రూ.19 వేల కోట్లు బాదేశారన్నారు. ఇప్పుడు ట్రూడౌన్ అంటూ కొత్త నాటకాలకు తెరతీశారన్నారు. సామాన్యులపై భారం మోపడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రూ.300 బిల్లు వచ్చే సామాన్యులకు సైతం రూ.1,000 వరకు బిల్లు వస్తోందన్నారు. ఇప్పుడేదో తగ్గిస్తున్నట్లు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో వ్యక్తులపై, వ్యవస్థలపై దాడులు జరుగుతున్నాయన్నారు.

ఇప్పుడిప్పుడే కూటమి మోసాలు బయటపడుతున్నాయన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చేసరికి విద్యుత్ చార్జీల తగ్గింపు అనే కొత్త నాటకానికి తెరలేపారన్నారు. ప్రజలు అన్ని విషయాలనూ గమనిస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ధ్యేయం



ప్రమాణం చేయిస్తున్న డీసీహెచ్ కళ్యాణ్‌బాబు

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ పరివార్ కార్యక్రమం జరుగుతోందని, 2800 మంది మహిళలకు ప్రత్యేక తనిఖీలు చేపట్టడం జరిగిందని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి కళ్యాణ్‌బాబు అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు తనిఖీలు చేపట్టారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని.. అక్టోబర్ 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మహిళలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలరావు.. మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో 242 మందికి తనిఖీలు నిర్వహించామని, 24 యూనిట్లు రక్తం సేకరించామని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై ఆరా

సాక్షి ఎఫెక్ట్



వసప వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

కొత్తూరు: వసప గ్రామ సమీపంలో వంశధార నదిలో బలద ర్యాంపు పేరుతో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపులో 'తవ్వేస్తాం.. దోచేస్తాం' అనే శీర్షికతో ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ కె.బాలకృష్ణ స్పందించారు. ఇసుక ర్యాంపును మంగళవారం పరిశీలించారు. ఇసుక తరలిస్తున్న వాహనాలకు క్యూఆర్ కోడ్‌తో ఉన్న రశీదులు ఇవ్వకపోతే కఠిన చర్యలు తప్పవని ర్యాంపు నిర్వాహకులను హెచ్చరించారు. పరిమితికి మించి ఇసుక లోడ్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నదిలో తాత్కాలికంగా నిర్మించిన గట్టును తొలగించాలన్నారు. స్టాక్ పాయింట్ వద్ద లారీలకు ఇసుక లోడ్ చేస్తున్నప్పుడు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ప్రతీరోజు ఇసుక విక్రయాల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

2న చేపలు, మాంసం విక్రయాలు నిషేధం

ఆమదాలవలస: ఈ నెల 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా మాంసాహార విక్రయాలను పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని చికెన్, మటన్, చేపల విక్రయాదారులు, హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసాన్ని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పరామర్శ..



మొదలవలస రామును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని గుత్తావల్లి గ్రామంలో పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ మంగళవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త బొడ్డేపల్లి నాగరాజు ఇటీవల అనారోగ్యానికి గురికాడంతో ఆయనను, ఇటీవల కాలుకి ఆపరేషన్ అయి కొలుకుంటున్న మొదలవలస రామును కలిసి పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురం రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి నారాయణమూర్తి, నాయకుడు సాకేటి శ్రీనివాసరావు, ఆ గ్రామానికి చెందిన నాయకులు ఉన్నారు.

మురుగునీటి కాలువలు నిర్మించరూ..



ఈ చిత్రం సారవకోట మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు. మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఇంట్లో వినియోగించే నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. పలుచోట్ల నీరు నిల్వ కావడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి మురుగునీటి కాలువలను నిర్మాణించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

\- సారవకోట

సిబ్బందే.. వైద్యులు..!



ఈ చిత్రం కొత్తూరు మండలం కురిగాం పీహెచ్‌సీలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఫార్మాసిస్టు. పీహెచ్‌సీ వైద్యులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. మంగళవారం కూడా వైద్యాధికారులు విధులకు హాజరుకాలేదు. వైద్యం కోసం వస్తున్న రోగులకు ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వైద్యం అందివ్వడంతోపాటు మందులు అందించారు.

\- కొత్తూరు

పట్టపగలే వెలుగులు



ఈ చిత్రం కొత్తూరు మండలం మాకవరంలో పట్టపగలే వెలుగుతున్న విద్యుత్ దీపం. గతకొద్ది రోజులుగా వీధుల్లో రాత్రీపగలూ విద్యుత్ బల్బులు వెలుగుతున్నా పంచాయతీ కార్యదర్శి, లైన్‌మన్ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

\- కొత్తూరు

కార్యకర్తలతో కృష్ణచైతన్య



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీలు, పార్టీ నాయకులు

- 2వ తేదీ నుంచి ప్రారంభం
- వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

నరసన్నపేట: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా అక్టోబర్ 2వ తేదీ నుంచి కార్యకర్తలతో ధర్మాన కృష్ణచైతన్య (పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు) కార్యక్రమం నిర్వహించనున్నట్లు నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి తెలిపారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో దీనికి సంబంధించిన గోడ పత్రికను పార్టీ నియోజకవర్గ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీలు మాట్లాడుతూ.. ఇప్పటికే నియోజకవర్గంలో 140 పంచాయతీలను 70 క్లస్టర్లుగా ఏర్పాటు చేశారన్నారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో ఇన్‌చార్జిని నియమించారని వివరించారు. రోజుకు రెండు క్లస్టర్ల చొప్పున పర్యటించి పార్టీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశాలకు పంచాయతీ స్థాయిలో ఉన్న పార్టీ కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాలైన యువజన, రైతు, మహిళా, బీసీ, ఎస్టీ, సోషల్ మీడియా కమిటీ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. పార్టీని మరింతగా అభివృద్ధి ఎలా చేయాలి అనేది చర్చిస్తారని తెలిపారు. అక్కడే కూటమి పాలనలో ఇబ్బందులకు, అన్యాయానికి గురైన వారితో మాట్లాడుతారన్నారు. 36 రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, నక్క తులసీదాస్, కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, జీవీ రమణి, దండి జయప్రకాశ్, సురంగి నర్సింగరావు, ఎం.కృష్ణ, లుకలాపు రవి, కణితి కృష్ణారావు, కణుసు సీతారాం, మొజ్జాడ శ్యామలరావు, నేతింటి రాజేశ్వరరావు బుద్దల రాజశేఖర్, పాగోటి గోవిందరావు, బార్ల వేణుగోపాలరావు, యాబాజి రమేష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందజేయాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: మండలంలోని రైతులందరికీ యూరియా అందజేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపీపీ సవర సావిత్రి అధికారులను కోరారు. స్థానిక ఏఓ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. మండలానికి అరకొరగా యూరియా రావడంతో రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా లభించకపోవడంతో ఒడిశా రాష్ట్రం నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందన్నారు. వరి పంటకు రెండో విడతగా యూరియా వేసే సమయం వచ్చేసిందని, ఇప్పటికైనా రైతులకు సరిపడేంత యూరియా పంపిణీ చేయాలన్నారు. ఈ–క్రాప్ నమోదుకు సెప్టెంబర్ 30 తేదీతో గడువు ముగిసిందన్నారు. మండలంలో కేవలం 60 శాతం మాత్రమే ఈ–క్రాప్ నమోదు జరిగిందన్నారు. పార్టీ నాయకులు అగతమూడి నాగేశ్వరరావు, మాతల తిరుమల, సంజీవరావు వనము లక్ష్మీనారాయణ, రంజిత్, రమేష్, శంకరరావు, రాజులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. కాపాడమ్మా..!



సారవకోట: దుర్గాదేవిగా ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలు, మండపాలకు వెళ్లి దుర్గమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: మెట్టక్కివలసలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, తదితరులు



బూర్జ: బూర్జలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



హిరమండలం: పెద్దకోరాడలోని నీలమణిదుర్గ ఆలయంలో దుర్గాదేవిగా..



ఆమదాలవలస: చిట్టివలసలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



నరసన్నపేట: ఉర్లాం మార్కెట్ కూడలిలో శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి



సరుబుజ్జిలి: పురుషోత్తపురం బంగ్లావీధిలో దుర్గాదేవి విగ్రహాన్ని దర్శించుకుంటున్న భక్తులు



పాతపట్నం: అంతరాబ కూడలిలో నీలమణిదుర్గ టాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహం



బూర్జ: లక్కుపురంలో కోలాటం ప్రదర్శిస్తున్న దృశ్యం